'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

# బ్రిటన్ ప్రజల తీర్పు

**బ్రిటన్ ప్రజలు** మార్పు కోరుకున్నారు. పద్నాలుగేండ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనను తిరస్కరించి లేబర్ పార్టీకి పట్టం కట్టారు. ఫ్రాన్స్‌తో సహా యూరప్ ఖండమంతటా జాత్యహంకారవాదులు పైచేయి సాధిస్తుంటే బ్రిటిష్ ఓటర్లు మాత్రం సామరస్యవాదాన్ని గెలిపించారు. యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమణ, శరణార్థి వ్యతిరేక రాజకీయ గావుకేకలను అత్యధిక శాతం ప్రజలు ఏ మాత్రం ఇష్టపడటం లేదని ఫలితాలతో తేలిపోయింది. భారతీయ మూలాలున్న రుషి సునాక్ ప్రధాని పదవి చేపట్టి కన్జర్వేటివ్ పార్టీని కష్టాల నుంచి గట్టెక్కించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆయన ఆర్థికరంగ నైపుణ్యం రాజకీయాలను మలుపు తిప్పలేకపోయింది. సామాన్యుల సంక్షేమానికి పెద్దపీట వేసే సామాజిక న్యాయ పార్టీగా పేరుపొందిన లేబర్ పార్టీ మొత్తం 650 స్థానాల్లో 63 శాతం, అంటే 412 సీట్లలో ఘనవిజయం సాధించింది. కాగా కన్జర్వేటివ్ పార్టీ 121 సీట్లకే పరిమితమైంది. సుమారు 200 సంవత్సరాల చరిత్రలో ఆ పార్టీకి ఇంత ఘోర పరాభవం ఎన్నడూ సంభవించలేదు. అయితే అద్భుతమైన విజయం సాధించిన లేబర్ పార్టీకి 34 శాతం ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. 'ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్' (మొదటగా గీత దాటినవారే విజేత) అనే సూత్రం ప్రకారం మూడింట రెండొంతుల స్థానాలు ఆ పార్టీ సొంతం చేసుకోగలిగింది. మాజీ ప్రధాని సునాక్ పార్లమెంట్‌కు ఎన్నికైనప్పటికీ మాజీ ప్రధాని లిజ్ ట్రస్‌తో సహా 11 మంది క్యాబినెట్ మంత్రులు లేబర్ సునామీలో కొట్టుకుపోయారు.

చరిత్రాత్మకంగా నిలిచిపోయే ఈ ఎన్నికల్లో కొన్ని ఇతర పార్టీల జయాపజయాలు బ్రిటన్ ప్రజల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. పర్యావరణ రక్షణ లక్ష్యంగా అవతరించిన గ్రీన్స్ పార్టీ తన బలాన్ని ఒకటి నుంచి నాలుగుకు పెంచుకోగలిగింది. అదే సమయంలో శరణార్థి వ్యతిరేక విధానాలతో దూకుడుగా వ్యవహరించే మితవాద రిఫామ్ యూకే పార్టీ పార్లమెంట్‌లో బోణీ కొట్టి నాలుగు సీట్లతో తొలిసారి అడుగుపెడుతున్నది. ఏడుసార్లు పోటీ చేసి ఓడిపోయిన ఆ పార్టీ అధినేత నిగెల్ ఫరాజ్ ఈసారి విజయాన్ని చేజిక్కించుకోవడం బ్రిటన్‌లో అతివాదుల ప్రాబల్యం పెరగడాన్ని సూచిస్తున్నది. స్కాట్లాండ్‌కు స్వాతంత్ర్యం కావాలని పోరాడుతున్న స్కాటిష్ నేషనల్ పార్టీ ఈసారి తుడిచిపెట్టుకుపోయింది. మరోవైపు ప్రస్తుతం బ్రిటన్‌లో భాగంగా ఉన్న ఉత్తర ఐర్లాండ్ స్వాతంత్ర్యాన్ని పొంది స్వతంత్ర దేశంగా కొనసాగుతున్న దక్షిణ ఐర్లాండ్‌తో విలీనం కావాలని కొట్లాడుతున్న సిన్ ఫెయిన్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచి ప్రాంతీయంగా అతిపెద్ద గ్రూపుగా ముందుకురావడం కీలక పరిణామం. గాజాపై ఇజ్రాయెల్ జరుపుతున్న దురాక్రమణ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ పోటీ చేసిన ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులూ గెలవడం చిన్న విషయమేమీ కాదు. ఇటీవలి కాలంలో బ్రిటన్ రాజకీయాల్లో పెరుగుతూ వస్తున్న శరణార్థి వర్గాల ప్రాబల్యం ఈసారి కూడా కొనసాగింది. గెలిచినవారిలో పలువురు స్టార్మర్ ప్రభుత్వంలో మంత్రులుగానూ చేరారు. అయితే తెలంగాణ మూలాలున్న ఇద్దరు అభ్యర్థులు - లేబర్ పార్టీ తరపున పోటీచేసిన ఉదయ్ నాగరాజు, కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగిన డాక్టర్ చంద్ర కన్నెగంటి ఓటమి చవిచూశారు.

ప్రజాగ్రహాన్ని ఆమోదించి ఓటమికి పూర్తి బాధ్యత వహిస్తూ సునాక్ తప్పుకోవడంతో సామాన్య కుటుంబం నుంచి వచ్చి అంచెలంచెలుగా ఎదిగిన కీర్ స్టార్మర్ ప్రధానిగా 'నంబర్ టెన్ డౌనింగ్ స్ట్రీట్' నివాసంలోకి అడుగుపెట్టారు. కొత్త ప్రధాని స్టార్మర్ ముందు జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లున్నాయి. ముఖ్యంగా ఆర్థికరంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. సంపన్న దేశాలన్నిటిలో పేదరికం అధికంగా ఉన్న దేశంగా బ్రిటన్ అపకీర్తి మూటగట్టుకున్నది. తక్షణం సంక్షేమాన్ని పట్టాలెక్కించి పేదలకు ఉపశమనం కలిగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక అంతర్జాతీయంగా అమెరికా విధానాలకు తోకగా మారిన బ్రిటన్‌ను ఆ ముద్ర నుంచి బయటపడేయాల్సి ఉంది. యూరోపియన్ యూనియన్ నుంచి నిష్క్రమణను (బ్రెగ్జిట్) వెనుకకు తిప్పి తిరిగి ఆ యూనియన్‌లో చేరే అవకాశాలు అంతగా కనిపించడం లేదు. యూరప్ దేశాలతో ఆర్థిక అనుసంధానాన్ని మెరుగుపర్చుకోవడం అనేది మరో పెను సవాల్. ఈ సమస్యల నేపథ్యంలో తక్షణమే కార్యరంగంలోకి దూకడమే తన ముందున్న కర్తవ్యమని ప్రధాని స్టార్మర్ ప్రకటించడం విశేషం.

### ఇప్పటికైనా మానుకోవాలి!



***ఢిల్లీలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను సర్వనాశనం చేయాలని బీజేపీ భావిస్తున్నది. అందులో భాగంగానే విద్యా శాఖ మంత్రి ప్రమేయం లేకుండానే రాత్రికి రాత్రి 5 వేల మంది టీచర్ల బదిలీలకు ఎల్జీ సక్సేనా ఉత్తర్వులిచ్చారు. ఆప్ ప్రభుత్వం, ఢిల్లీ ప్రజల పోరాట ఫలితంగా ఇప్పుడు ఆ ఉత్తర్వును వెనక్కి తీసుకున్నారు. ఇది ప్రజల విజయం. ఇప్పటికైనా ఎల్జీని అడ్డుపెట్టుకొని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడాన్ని బీజేపీ మానుకోవాలి.***

- **ఆతిశీ,** ఢిల్లీ విద్యా శాఖ మంత్రి

### లేఖ

## అశాస్త్రీయ టైం టేబుల్

**తరగతి గదిలో** దేశ భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మేధావులు చెబుతుంటారు. అందుకే విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి విద్యా వ్యవస్థ కృషి చేయాలి. విద్యార్థి నేర్చుకోవటానికి అనుకూలమైన వాతావరణం, కాలక్రమ పట్టిక విద్యా సంస్థల్లో ఉండాలి. ఇవన్నీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గురుకుల విద్యాలయాల కామన్ టైం టేబుల్‌కి వర్తించవు. ఇటీవల కామన్ టైం టేబుల్ పేరుతో ప్రిన్సిపల్ సెక్రెటరీ విడుదల చేసిన ప్రకటన విద్యార్థుల్లో, సిబ్బందిలో గందరగోళానికి దారితీసింది. గురుకుల వసతి గృహాల్లో విద్యనభ్యసించే విద్యార్థుల శారీరక, మానసిక, సామాజిక నేపథ్యాలను పట్టించుకోకుండా అశాస్త్రీయ టైం టేబుల్‌ను ప్రకటించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉదయం ఏడున్నరకు టిఫిన్ చేసే విద్యార్థులు.. ఆ తర్వాత నిరంతరాయంగా పాఠాలు వినటంపై శ్రద్ధ పెట్టగలరా? వసతి గృహ భవనాలు, అక్కడి మౌలిక వసతులు, హాస్టళ్లలో పనిచేస్తున్న మహిళా సిబ్బంది, విద్యార్థుల స్థాయి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా టైం టేబుల్ తీసుకురావటం వెనుక ఆంతర్యం ఏమిటనేది అధికారులకే తెలియాలి. ఈ కొత్త టైం టేబుల్ కారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి దీన్ని వెనక్కి తీసుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో అమలుచేసిన పద్ధతి ప్రకారమే ఆయా గురుకులాల్లో తరగతులను నిర్వహించాలి.

- **సామల కిరణ్, 99511 72002**

# ఏదో బుగులు.. ఏదో అపశకునం

**ఈ నెల ఆరవ తేదీన హైదరాబాద్‌లో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి అవసరానికి మించిన పబ్లిసిటీ వచ్చింది. పునర్విభజన చట్టంలో మిగిలిపోయిన అంశాల సంగతేమిటో గానీ గురుశిష్యుల సంబరమే అక్కడ వెల్లివిరిసింది. ఏ ఒక్క అంశాన్ని ఈ సమావేశంలో ముఖాముఖిగా తేల్చకుండా అధికారులతో, మంత్రులతో కమిటీలు వేస్తామనే నిర్ణయానికి ఇంతటి హంగామా అవసరమే లేదు. అయితే అది అక్కడితో ఆగకుండా మర్నాడే హైదరాబాద్ నడిబొడ్డున చంద్రబాబు నోట తెలంగాణ ప్రజలు ఎన్నడూ నమ్మని 'రెండు కండ్ల సిద్ధాంతం' మాటను మళ్లీ పలికించింది.**

**'తెలంగాణలో టీడీపీ పునర్నిర్మాణానికి సిద్ధం కండి' అని ఎన్టీఆర్ భవన్‌లో తనను కలవడానికి వచ్చిన వారితో చంద్రబాబు అన్నారు. 'తెలుగు జాతి ఉన్నంత వరకు తెలంగాణ గడ్డపై పసుపు జెండా ఎగురుతూనే ఉంటుంది. ఏపీలో పరిస్థితులు సరిచేసి ఇక్కడికి వస్తాను' అని ఆయన అన్నట్టు పత్రికల్లో వచ్చింది. పునర్విభజనలోని పెండింగ్ అంశాలను చర్చించడానికి చంద్రబాబు చొరవ తీసుకున్నట్టుగా రేవంత్ రెడ్డికి ఎందుకు లేఖ రాశారో, దాని అంతరార్థమేమిటో తెలంగాణ ప్రజలు గ్రహించాల్సిన సమయమిది.**



**బి.నర్సన్**
**94401 28169**



పక్కపక్కన ఉన్న రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలుసుకోవడం గొప్ప విషయమేమీ కాదు. దానికి అంత ప్రచారం అవసరం లేదు. కానీ, పసుపు మీడియా కావాలని ఆ భేటీని గొప్పగా చిత్రిస్తోంది. కొన్ని టీవీ చానళ్లు చంద్రబాబు కదలికలను గంటల పాటు లైవ్‌లో చూపించాయి. చంద్రబాబు, రేవంత్ ఇళ్ల ముందు కెమెరాలు పెట్టి 'ఆయన వస్తున్నాడు, ఈయన వచ్చేశాడు' అంటూ అడుగడుగునా కవరేజీ చేశాయి. ఏపీ ముఖ్యమంత్రి అయ్యాక హైదరాబాద్‌కు చంద్రబాబు రావడాన్ని తెలంగాణ పండుగలా మీడియా పొంగించింది. దాన్ని ఆసరా చేసుకొని తానే హైదరాబాద్ నవనిర్మాతనని చంద్రబాబు రాగమందుకున్నారు. ఇక్కడ పాలకులే లేరు, తెలంగాణ ప్రగతికి తన అవసరం ఉందన్న రీతిలో ఆయన మాట్లాడుతుంటే.. తెలంగాణ ప్రభుత్వం నోరు మెదపడం లేదు.

కొన్ని పత్రికల విర్రవీగుడుతనం చూస్తుంటే.. ఏపీలో బాబు గెలుపుతో 'మళ్లీ మనపై ఆంధ్రా పెత్తనం మొదలైందా' అన్న అనుమానాలు కలుగుతున్నాయి. తెలంగాణ సాధకుడిగా జనం గుండెల్లో నిలిచిన కేసీఆర్ మాటలను ఎద్దేవా చేసేందుకు ఆయా పత్రికలు ఎగబడుతున్నాయి. పదేండ్ల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం ప్రధాన విపక్ష నేతగా ఉన్న వ్యక్తిని ఓ సినిమాలోని డైలాగ్‌ను ఉదహరిస్తూ కించపరచడం దుస్సాహసమే. ప్రస్తుత ప్రభుత్వం చంద్రబాబుకు ఘన స్వాగతం పలికి, ఆయనతో రాసుకు పూసుకోవడమే ఆ తెగింపునకు బలమిచ్చిందని చెప్పాలి. చంద్రబాబు, రేవంత్ గురుశిష్యులే. 2015లో కేసీఆర్ ప్రభుత్వాన్ని కూల్చడానికి పన్నిన ఓటుకు నోటు కేసులో వారు నిందితులు. ఆ కుట్రలో ఒకరు డైరెక్టర్ అయితే, మరొకరు యాక్టర్ అని వీడియో స్పష్టం చేస్తున్నది.

అసలు 'కలిసి మాట్లాడుకుందాం' అని చంద్రబాబు లేఖ రాయడమే ఒక కుట్ర. అదే నిజమైతే అందుకు తగిన ఫైళ్లు, సరంజామా పట్టుకొచ్చి ఒకట్రెండు రోజులు మంత్రులు, అధికారులు కూర్చొని పరిష్కారాలు కనుక్కోవచ్చు. ఎన్నిసార్లయినా సమావేశం కావచ్చు. అందుకు భిన్నంగా ఓ సాకు పెట్టుకొని ఇక్కడికి వచ్చి మళ్లీ తెలంగాణలో తన ప్రాబల్యం పెంచుకోవాలనే దురాశ చంద్రబాబు మాటల్లో బయటపడింది.

**ఆయన పక్క రాష్ట్రానికి సీఎం అయినంత మాత్రాన తెలంగాణలో అడుగుపెట్టగానే విమానాశ్రయం నుంచి స్వాగత యాత్రకు, ఊరేగింపునకు అనుమతులు, బందోబస్తు ఎందుకు? ఈ సంబరాలు దేనికి సంకేతం? ఇంత జరుగుతున్నా తెలంగాణ ముఖ్యమంత్రి చూసీచూడనట్టు ఎందుకు ఉంటున్నారు? అనేది తెలంగాణవాదులకు అంతుచిక్కని ప్రశ్న.**

'రెండు రాష్ట్రాల్లోనూ నా హవా నడుస్తుంది' అన్నట్టు బాబు వ్యవహరిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే 1956లో నెహ్రూ అన్న మాటలు గుర్తుకొస్తున్నాయి. హైదరాబాద్ స్టేట్, ఆంధ్రా కలయికతో ఏర్పడ్డ ఏపీ అవతరణను.. 'అమాయకపు పిల్లను, గడుసు అబ్బాయికి ఇచ్చినట్టుంది' అని ఆయన పేర్కొన్నారు. ఆ అమాయకత్వం తెలంగాణను ఇంకా వీడలేదేమో.. మాయమాటలను నమ్మి మళ్లీ బోల్తా పడుతుందేమోననే బుగులు, ఏదో అపశకునం ఇప్పుడు పొడసూపుతోంది.

ఏపీ ఎన్నికల ఫలితాలు రాగానే హైదరాబాద్ రోడ్లపై పచ్చజెండాల బైకుల ఊరేగింపు, వారు చేసిన హంగామా, ఒక్కసారిగా ఏర్పడ్డ ట్రాఫిక్ ఇబ్బందులు ఇంతాఅంతా కాదు. 'ఇక్కడి ఎన్నికలు కాదు, ఇక్కడి పార్టీ కాదు.. ఎక్కడో జరిగిన ఎన్నికల ఫలితాలకు ఇక్కడ ఈ లొల్లి ఏంద'ని వాహనదారులు విసుక్కోక తప్పలేదు. పోలీసులు ఆ మూకలను నిలువరించలేకపోయారు. పోయిన సెప్టెంబర్‌లో జరిగిన చంద్రబాబు అరెస్టు పట్ల నిరసన ప్రదర్శనలకు హైదరాబాద్‌లో అనుమతి లభించలేదు. 'పక్క రాష్ట్రంలో జరిగిన దానికి ఇక్కడెందుకు ర్యాలీలు' అంటూ అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వాటిని ఆపివేశారు. ఇప్పుడు ఆ హద్దులు చెరిగిపోయాయి. గతంలో టీడీపీలో ఉండి ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఉన్న ఎమ్మెల్యేలు ఏ బెరుకు లేకుండా చంద్రబాబును కలుస్తుంటే.. కాలం ఎటు నుంచి ఎటు తిరుగుతుందో అర్థం కావడం లేదు.

తిరుపతిలో మన ఎమ్మెల్యేల సిఫారసులు చెల్లే అవసరం లేదు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హైదరాబాద్‌లో స్థలాల కేటాయింపు వద్దు. 'మాకు పోర్ట్ లేదు, మీ తీరంలో మాకు పాలు ఇవ్వండి' అని రేవంత్ అంటే ఇవ్వడానికి చంద్రబాబు ఎవ్వరు? కొట్లాడి విడిపోయినాక 'మళ్లీ పొత్తు కూడుదామా' అని ఇద్దరు ముఖ్యమంత్రులు అనుకుంటే సరిపోదు. ఏపీ అయినా, తెలంగాణ అయినా ఎవరెవరికి ఏమి ఇవ్వాలనే విషయంలో ప్రజాభిప్రాయం కావాలి. ఏపీలో తెలంగాణకు చెందేదేమీ లేదని, ఇద్దరు ముఖ్యమంత్రులు ఏం చర్చించినా దాన్ని లైవ్‌లో టెలికాస్ట్ చేయించాలని ఏపీలో ప్రతిపక్షం అంటోంది. పునర్విభజన చట్టం, 2014లో ఉన్న అంశాలకు పరిష్కారం లభిస్తే చాలు. ఆ తర్వాత ఎవరి బతుకులు వారు బతికితే అదే తెలంగాణకు మేలు.



## యుద్ధం కోరుతున్నా అశోక్

యుద్ధంలో కావలసింది
యుద్ధం చేయడం

ఆర్తనాదాలు కాదు
కన్నీళ్లు కార్చడం కాదు
గులగటాలు కాదు
మబ్బుల రాక కోసం నింగి వైపు
చూడటం కాదు
యుద్ధమేఘాల జాడలున్నాయి
వాటిని పసిగట్టడం కావాలి
యుద్ధంలో కావలసింది
యుద్ధం చేయడం

ఈ నేల రక్షణకు
ఈ జాతి భవిష్యత్తుకు
తెలంగాణ తల్లి చిరుహాసానికి
గతం పునరావృతం కాకుండేందుకు
పోరాటాల వారసత్వం మాసిపోక నిలిచేందుకు
ఇప్పుడు కావలసింది యుద్ధం
యుద్ధంలో కావలసింది
యుద్ధం చేయడం

ఈ గడ్డ తెర్లుతెర్లు కాకుండేందుకు
తిరిగి వస్తున్న పారుగు రాబందులు మళ్లీ
హైదరాబాద్‌పై రెక్కల నీడలు పరవకుండేందుకు
ఇప్పుడు కావలసింది యుద్ధం
యుద్ధంలో కావలసింది
యుద్ధం చేయడం

ఎడతెగని సమీక్షలు కాదు
ఎటూతేలని భాషణలు కాదు
కాలయాపనలు కాదు
అంతులేని వ్యూహరచనలు కాదు
ఇప్పుడు కావలసింది యుద్ధం
యుద్ధంలో కావలసింది
యుద్ధం చేయడం



**టంకశాల అశోక్**

# పంచాయతీలపై పగబట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

**గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పాలనలో కునారిల్లుతున్నది. ప్రజల భాగస్వామ్యానికి నమూనాగా, పరిపాలనా వికేంద్రీకరణకు ఆనవాలుగా, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అత్యంత చేరువగా ఉండే ప్రజాప్రతినిధి వ్యవస్థకు చిరునామాగా ఉండాల్సిన గ్రామ పంచాయతీలు.. రేవంత్‌రెడ్డి పాలనలో ఏడు నెలల్లోనే నిర్జీవమవుతున్నాయి. దమ్మిడీ ఆదాయం లేక, రాష్ట్ర ప్రభుత్వం నిధులివ్వక, కొర్రీలు పెడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రాష్ట్ర సర్కార్ నిలువు దోపిడీ చేస్తుండటంతో పంచాయతీ వ్యవస్థ కుప్పకూలే స్థితికి చేరుకున్నది.**



**బూడిద భిక్షమయ్య గౌడ్**



గ్రామస్వరాజ్యం సాధనే లక్ష్యంగా పాలన సాగించిన కేసీఆర్ సర్కార్ గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేసింది. పాలనా వికేంద్రీకరణలో భాగంగా మారుమూల గ్రామాలు, తండాలను పంచాయతీలుగా చేసింది. ఆయా పంచాయతీల్లో పాలనా సౌలభ్యం కోసం మల్టీపర్పస్ వర్కర్ల పేరిట అనేకమంది కార్మికులను నియమించింది. ఆ కార్మికుల సేవలను గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారి వేతనాన్ని కూడా పెంచింది. నెలకు రూ.9,500 గౌరవ వేతనంగా చెల్లించింది. అయితే మొదటి వేతన సంఘం ప్రకారం.. నెలకు రూ.19 వేలు వేతనం చెల్లించాలని కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండగా.. ప్రస్తుతం ఇస్తున్న వేతనాన్నే సమయానికి ఇవ్వడం లేదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలతో పాటు కార్మికుల బతుకులు ఆగమయ్యాయి. గ్రామాలను బాగు చేస్తున్న కార్మికుల జీవితాలు మాత్రం బాగుపడటం లేదు. చాలీచాలని వేతనాలతో వారు బతుకీడుస్తున్నారు. ఆరు నెలలుగా వేతనాలు అందకపోవడంతో, ఇక చేసేదేమీ లేక ఆందోళన బాటపట్టాల్సి వస్తున్నది. పంచాయతీ కార్మికుల కష్టాలకు మెదక్ జిల్లా చేగుంట మండలంలో జరిగిన ఘటనే నిదర్శనం. మండలంలోని మునిగడప, పలుగుగడ్డ తదితర గ్రామాల కార్మికులు వేతనాల కోసం ఉన్నతాధికారులను వేడుకున్నా, వినతిపత్రాలు సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోయింది. దీంతో వారంతా ఏకమై భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నది.

**మరోవైపు ఇతర కార్మికుల వలె పంచాయతీ కార్మికులకు బీమా సౌకర్యం లేదు. దీంతో ట్రాక్టర్ బోల్తా పడి ప్రాణాలు కోల్పోయిన, తీవ్ర గాయాలపాలై మంచాన పడుతున్న కార్మికుల కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్నాయి. పంచాయతీ కార్మికులకు రూ.5 లక్షల బీమా కల్పించాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించినప్పటికీ సానుకూల స్పందన రాలేదు.**

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నప్పటికీ, పస్తులుంటూనే కార్మికులు విధులకు హాజరవుతుండటం గమనార్హం. ఎప్పటికైనా క్రమబద్ధీకరిస్తారనే ఆశతో వారు గడ్డు పరిస్థితులు ఉన్నప్పటికీ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో వారి బాధలు చూడలేక కొన్నిచోట్ల కార్యదర్శులు అప్పులు తెచ్చి రెండు, మూడు నెలల జీతాలిచ్చి ఆదుకుంటుండటం కొంత వరకు ఉపశమనం కలిగించే అంశం.

పాలకవర్గాల గడువు ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. వారి చేతుల్లో పరిమితమైన అధికారాలు మాత్రమే ఉండటంతో పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతున్నది. అనేక పంచాయతీల్లో ప్రత్యేక అధికారులకు చెక్‌పవర్ ఇవ్వలేదు. దీనివల్ల వివిధ అభివృద్ధి పనుల అమలుతో పాటు కార్మికుల జీతాల చెల్లింపు సైతం ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికే అనేక సమస్యలతో గ్రామాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్కో అధికారికి మూడు, నాలుగు పంచాయతీల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం మరిన్ని సమస్యలకు దారితీస్తున్నది. పనిభారం కారణంగా ప్రత్యేక అధికారులు చుట్టపు చూపుగానే పల్లెలను సందర్శిస్తున్నారు. దీంతో సమస్యల చిట్టా అంతకంతకూ పెరుగుతున్నది.

ప్రధానంగా తాగునీటి సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలకు వారాల తరబడి పరిష్కారం దొరకడం లేదు. పాడైపోయిన చేతిపంపులు నెలల తరబడి మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాటిని బాగుచేసే నాథుడే కరవయ్యాడు. అదే సమయంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో మళ్లీ బిందెలు పట్టుకొని మహిళలు రోడ్డెక్కాల్సిన దుస్థితి ఏర్పడింది. అంతేకాకుండా, పారిశుద్ధ్యం కూడా పడకేసింది. పర్యవేక్షించాల్సిన అధికారులు వారానికోసారి కూడా అటువైపు కన్నెత్తి చూడటం లేదు. గ్రామాల్లో చెత్త సేకరణ కోసం కొనుగోలు చేసిన ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారుతున్నది. ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో నెలవారీ ఈఎంఐ గుదిబండగా మారుతున్నది.

**కేంద్ర ప్రభుత్వ నిధులు రెండు నెలలకోసారి మంజూరవుతున్నా అవి ఎటూ సరిపోవడం లేదు. పాలకవర్గం ఉన్నప్పుడు సర్పంచులు అప్పోసొప్పో చేసి గ్రామాలను అభివృద్ధి చేసేవారు. కానీ, ఇప్పుడు పంచాయతీల్లో నిధుల లేమితో అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రత్యేక అధికారుల పాలనలో రాజకీయ జోక్యమూ మితిమీరిపోయింది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల వల్ల ఉన్నతాధికారులు కూడా మిన్నకుండిపోతున్నారు.**

ఒకప్పటి పరిస్థితికి ఇప్పటి పరిస్థితికి చాలా తేడా ఉంది. కేసీఆర్ నాయకత్వంలో పల్లెప్రగతి అద్భుత ఫలితాలను సాధించింది. మౌలిక వసతులు కల్పించడంతో పల్లెలు, పట్టణాలు పరిశుభ్రతతో, పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాయి. అయితే ఈ అభివృద్ధి అంత సులభంగా ఏమీ జరగలేదు. పటిష్ఠమైన చట్టాలు, సమగ్ర ప్రణాళిక, యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించడంతోనే అద్భుతమైన ప్రగతి సాధ్యమైంది. 2014 ముందు స్థానిక సంస్థలకు తమ బాధ్యతలు, విధులకు సంబంధించి సరైన మార్గనిర్దేశనం ఉండేది కాదు. జవాబుదారీతనం లేని స్థానిక నాయకత్వం రాజకీయాలకు, పైరవీలకే పరిమితమయ్యేది. దీంతో పల్లెలు, పట్టణాల పరిస్థితి అధ్వానంగా ఉండేది. స్థానిక సంస్థల పనితీరును మెరుగుపరిచేందుకు కేసీఆర్ సర్కార్ నూతన పంచాయతీరాజ్, పురపాలక చట్టాలను ప్రవేశపెట్టింది. పాలకులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ.. పారదర్శకంగా, బాధ్యతాయుతంగా పాలన అందించేలా స్పష్టమైన లక్ష్యాలను ఆ చట్టాల్లో నిర్దేశించింది. అంతేకాదు, సమర్థవంతంగా పన్నులు వసూలు చేయడంతో పాటు, పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచే విధంగా మార్గనిర్దేశం చేసింది. లక్ష్య సాధనలో అలసత్వం ప్రదర్శించిన ఉద్యోగులతో పాటు, ప్రజాప్రతినిధులపై సైతం కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టంలో నిబంధనలను పొందుపరిచింది. దీంతో స్థానిక సంస్థల పనితీరులో అద్భుతమైన మార్పు వచ్చింది.

**అయితే గత ప్రభుత్వ లక్ష్యాలను నీరుగార్చే విధంగా కాంగ్రెస్ సర్కార్ వ్యవహరిస్తుండటం బాధాకరం. ఏ సర్కార్ అయినా గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూనే, కొత్త పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు సంక్షేమ పాలన అందించాలి. కానీ, రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేస్తానంటూ కక్షపూరిత రాజకీయాలకు దిగుతున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ సర్కార్ చేసిన మంచి పనులను కూడా పక్కనపెడుతుండటం ఆందోళనకరం.**

పార్లమెంట్ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడానికే ముఖ్యమంత్రికి సమయం సరిపోవడం లేదు. గడిచిన ఏడు నెలల్లో గ్రామ పంచాయితీలపై ఆయన సమీక్షే చేయలేదు. కేవలం ప్రత్యేక అధికారులను నియమించి చేతులు దులుపుకొన్నారు. ఆ అధికారులకు చెక్‌పవర్ కూడా ఇవ్వలేదు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనా అనుభవం, అవగాహన రెండూ లేవు. అందుకే ఆయన ఎంతసేపూ కుట్ర రాజకీయాలకు తెరలేపుతున్నారు. అందులో భాగంగానే తన ఆస్థాన మీడియాకు రోజుకో లీకు ఇస్తూ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. అనుభవమున్న ఒకరిద్దరు సీనియర్ నాయకులు రాష్ట్ర క్యాబినెట్‌లో ఉన్నారు. గ్రామాలపై దృష్టి సారించి, సమీక్షలు నిర్వహించి, పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కనీసం వారైనా ముఖ్యమంత్రికి సలహా ఇవ్వాలి. తద్వారా పంచాయతీల సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది. అలాగే మల్టీపర్పస్ వర్కర్లకు నెలనెలా వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉన్నది. దాంతో పాటు త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, గ్రామాల్లో పాలనను గాడిన పెట్టాలి.

*(వ్యాసకర్త: ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు)*